# నందనవనం - 22

రామం అవునన్నట్లు తల వూపగానే సంతోషంగా శ్రీవల్లి వైపు చూసి ''చూశావా... లచ్చిందేవీ... నా పేరు సుబ్బరాయశర్మగా చెప్పుకునే అర్హతను మా నాన్న దృష్టిలో సంపాదించగలిగేను...!'' అన్నాడు.

''అవును! ఈ విషయంగా నాకూ ఆనందంగానే ఉందిగానీ, మనం తెలుసుకోవలసిన చిక్కుముడి ఇంకా విడివడలేదుగా అది మాత్రం అలాగే ఉంది...!'' అంది శ్రీవల్లి.

''అదేం ఫర్వాలేదు... నాకో ఆలోచన ఉంది... తెలుస్తుందిలే!'' అన్నాడాయన.

''ఏంటది...? చెబితేఏం....'' శ్రీవల్లికి ప్రశ్నకి సూటిగా సమాధానం ఇవ్వకుండా ''తొందరెందుకూ, త్వరలోనే తెలుస్తుందంటున్నాగా...!'' అనేశాడాయన.

శ్రీవల్లి చిరునవ్వుతో రామం వైపు చూసి.. "నువ్వు నందితకు ఫోను చేసి మీ పెళ్ళి జరుగుతుందని చెప్పు'' అంది.

''ఏమిటమ్మా ఇది... భద్రయ్య గారికి మాట ఇచ్చినట్లుగా ఇపుడేగా చెప్పావ్....?'' సందేహంగా తల్లివైపు చూస్తూ అన్నాడు.

''నిజమేరా... కానీ అనుమానాలన్నీ తీరిపోయాయిలే. నేను ఏం అనుకుని నందూతో నీ పెళ్ళని వద్దనుకున్నానో... అది నిజం కాదని తెలిసిందిలే! అయినా... నేను

వద్దన్నపుడు ఏమీ మాట్లాడకుండా 'సరే' అన్నవాడివి... ఇపుడు నేనే చెబుతుంటే, కారణం అడుగుతున్నావే''అంది శ్రీవల్లి.

''మరి ఇపుడేగా... నాన్న చెప్పారూ... ప్రశ్నించటం మంచి పద్ధతీ అని! అందుకేనేమో... ఆ దారిలో వచ్చానన్నమాట!'' అంటూ రామం చిన్నగా నవ్వాడు... ''ఇక మళ్ళీకాదనవుగా?'' అంటూ సెల్‌ఫోన్ తీసుకుని నవ్వు మొహంతో బయటకు నడిచాడు.

ఆయన కొంచెం చిరాకుగా శ్రీవల్లి వైపు చూసి ''నువ్విలా చేయటం ఏమీ బాగాలేదు! భద్రయ్య తప్పుచేసి ఉండొచ్చు, ఉండకపోవచ్చుగానీ, వాళ్ళమ్మాయి అమాయకురాలేగా, తన ఇష్టానికి విలువిచ్చి అంగీకరించి నట్లుగా చెప్పి, మళ్ళీ... ఇదేమిటీ? అమ్మాయిల మనసుతో ఆటలాడు కుంటున్నట్లుగా లేదూ..?'' అనడిగాడు.

శ్రీవల్లి నిట్టూర్చింది. అంతకు ముందు రోజు జరిగిన సంఘటన చెప్పింది. శ్రీవల్లి ఇంకో గదిలో నుండి హాలు గదిలోకి వచ్చేసరికి పెరటిగుమ్మం నుండి ఎవరో చిన్నమ్మాయి పరుగు పెట్టటం చూసి నిర్ఘాంతపోయింది! ఎందుకు, ఎవరు, ఏమిటీ అని ఆలోచిస్తూండగానే అక్కడ చిన్న టేబుల్‌పై ఉన్న కాగితం మడత కనుపించింది. తీసి చూస్తే... 'మా నాన్న చెప్పినవన్నీ నిజాలు కావు' అన్న ఒకే ఒక వాక్య ఉంది! భద్రయ్యగారి కూతురే ఆ చీటీ ఆ చిన్న పిల్లతో పంపించిందేమోననే అనుమానం వచ్చింది గానీ నిర్ధారణ కాలేదు. ఆ సాయంకాలమే భద్రయ్యగారింట్లో పనిచేసే అనసూయ వచ్చి రహస్యంగా చెప్పింది... 'రామంతో ప్రేమ... అదంతా తండ్రి పన్నాగమేగానీ, వాళ్ళమ్మాయి ప్రమేయం, ప్రేమ ఏమీ లేదని అంతా కల్పనేనని!'

ఎందుకు ఆయనలా చేశాడోనని ఆలోచిస్తున్నా. కారణం మాత్రం అంతుబట్టలేదు!"

''అవునా?'' అంటూ ఇదంతా ఆసక్తిగా విన్న ఆయనా ఆలోచనలో పడ్డాడు.

* * *

బయట మొక్కల దగ్గరకు వచ్చిన రామం నందితకు ఫోను చేశాడు. ''ఇదేమిటీ..? ఈ సమయంలో... ఇంత హఠాత్తుగా...?''

ఆ ప్రశ్నకి రామం చిన్నగా నవ్వి ''ఫోను చేస్తాననే విషయం కూడా ముందుగా చెప్పాలా? ఎలా...?'' అని ఎదురు ప్రశ్న వేశాడు.

''సరే, సరే... ఆ అవసరం లేదుగానీ, విషయం ఏమిటో చెబుదూ...?"

''చిరునవ్వుల చిలకమ్మకి ఓ చిన్న మాట చెవిని వేయాలనీ...'' సరదాగా అన్నాడు.

''మరుమల్లెల మారాజా... ఆ చిన్నమాటని చప్పున సెలవీయరాదా...?'' అల్లరిగా నవ్విందామె.

''మనసులో ఉప్పొంగుతున్న ఆనందాన్ని నీతో పంచుకోవాలనీ...''

''రాంగ్ నెంబర్ భద్రయ్య గారి కమలకి చేయండి...''

అతను తృళ్ళిపడి ''ఇపుడే నాకు అమ్మ చెబితే తెలిసిందీ విషయం... ఇంతలోనే మరి... నీకెలా...?'' అడిగాడు.

‘‘నీకే ఆఖరున తెలిసింది నాకు మాత్రం ఆరోజే ఈ కబురు అందింది! ఇలాంటి వార్తల్ని నమ్మకంగా చేరవేసేవాళ్ళు కొందరు ఉంటార్లే...! చిటికెలో తెలిసిపోతాయి! కమల సెల్ నెంబరు తెలుసునా... చెప్పాలా...?’’

‘‘ఆ కమల ఎవరో నాకు తెలియదుగానీ, ఇపుడు నేను ఫోను చేసి... మా అమ్మ రూటు మార్చేసి తన ఓటును మునుపటి పిల్లకేనంటూ నిన్నే ఎన్నిక చేసేసిందని చెప్పటం బావుంటుందంటావా...’’

‘‘అవును... అస్సలు బావుండదు...! ఇదేం లక్కపిడతల ఆట కాదు... ఆడపిల్లల మనసులతో ఆటలాడటం భావ్యం కాదని గోలచేసే అవకాశం ఉంది! అయినా అదేం పద్ధతి...? కాసేపు ఒకరు, మరి కాసేపటికి ఇంకొకరూనా...? నాకేం నచ్చలేదు...!’’

‘‘కదా.... నాకూ అంతే...! ఈ విషయం అమ్మని గట్టిగా అడిగేయ్... మీ ఇంటికి వచ్చినపుడు.’’

‘‘మనసును మరో మార్గంలోకి మళ్ళించి... ఎంతో కొంతదూరం వెళ్ళాక... ఇపుడు ఇలా అంటే ఎలా...?’’

‘‘వెళ్ళటం కొంచెం కష్టమే గానీ... వెనక్కి రావటం ఎంతసేపని అమ్మ అనుకుందేమో! కుదరదంటావా?’’

‘‘ప్రయత్నిస్తాలే! కొంచెం సమయం పడుతుంది మరి!’’

‘‘అలాగే, కావలసినంత సమయం తీసుకో. తొందరేంలేదు. నాకు నచ్చే సమాధానమే వస్తుందని తెలిసినపుడు... వేచి ఉండటానికి నాకేం బాధలేదు!’’

‘‘అంత నమ్మకమా...? ఏమో... ఎలాంటి సమాధానం వస్తుందోఎలా ముందే ఎలా చెప్పగలనూ?’’

‘‘పెళ్ళి రద్దును అంగీకరించినంత తేలిగ్గా, తొందరగా మరో పెళ్ళికి సిద్ధం అవుతానని ఎలా అనుకున్నారూ...? ఇప్పటికి మాత్రం మరొకరితో పెళ్ళిని అంగీకరించే ప్రశ్నే లేదని’ మీ వాళ్ళతో చెప్పింది నువ్వేగా...?’’

‘‘ఇది... ఇది... నీకెలా తెలుసూ...?’’

‘‘నీలాగే నాకూ... నమ్మకంగా.... కబుర్లు చేరవేసే వాళ్ళున్నారని అర్థం అయిందా...? నీకు చిటికెలో అందే సమాచారం... నాకు... రెండు చిటికెల సమయం పడుతుందేమో... అంతేకదా! అయినా నందూ, నువ్వు అమ్మని ఆరోజే ఎందుకు అదే... ఇపుడు నువ్వన్న మాటని... ‘ఆడపిల్ల మనసుతో ఆటలేమిటని.. అడగలేదేం? మా పెళ్ళికి అంగీకారం తెలిపి, ప్రేమని ప్రోత్సహించి, ఇపుడు హఠాత్తుగా మనసు మార్చుకుని వీల్లేదంటే ఎలా’ అని కోపం తెచ్చుకోలేదేం...? ఎందుకనీ?’’

‘‘రామూ...’’ ఫోనులో గోముగా పలికింది నందూ కంఠస్వరం. ‘‘నిజం చెప్పనా... మా అమ్మ మొహం చూస్తూ నేను అబద్దం చెప్పలేను! అలాగే అత్తమ్మ మాటల్ని కాదనే శక్తీ నాకు లేదు... అంగీకరించటమే తప్ప! పైగా... అత్తమ్మ మాటని శిరసావహించే అవకాశం దొరకటం నాకెంతో గౌరవప్రదమైన విషయంగా అనిపించటం... అంత బాధలోనూ.. రవ్వంత ఆనందాన్ని కలిగించింది... తెలుసా... వినటానికి విచిత్రంగా ఉండొచ్చుగానీ నిజం మరి! అందుకనీ.... ఇపుడు మళ్ళీ అంగీకరించటానికి కొంచెం సమయం నేను కావాలన్నాననే మాట మాత్రం అత్తమ్మతో చెప్పకేం...! అసలే నువ్వు అమ్మకూచివిగా, వెంటనే చెప్పేస్తావని అనుమానం వచ్చిందిలే...!’’

రామం సరదాగా నవ్వేసాడు! ''చెప్పనుగానీ, నేను అమ్మకూచినేననీ ఒప్పుకుంటాను! మరి... నువ్వు... నాన్న కూచివా...?''

''కాదు...!''

''మరి....?''

''నేను... ప్రేమకూచిని! ఎవరు... ఆపేక్ష చూపించినా వాళ్ళ పక్షమై ఆ ప్రేమకి దాసోహమైపోతాను కాబట్టి అలా అంటున్నాను! అంటే... నేను త్వరత్వరగా పార్టీలు మార్చేస్తుంటానన్నమాట! ఆఖరుకు... మా ఇంట్లో నా పనులు చేసిపెట్టే మల్లి... ఆదరంగా పలకరించినా నేను పులకించి... ఆ ప్రేమాభిమానాలకు చలించిపోయి... అందరికంటే తనే నాకు ముఖ్యమైన వ్యక్తిగా అనిపిస్తుందా క్షణం! అర్థమౌతోందా నేను చెబుతున్నదీ...!''

''చక్కగా... అర్థమైంది.... నువ్వు త్వరలోనే... మా ఇంట్లో అందరి కూచీగా మారిపోతావని!''

''అపుడు... అది నా ఇల్లు కూడా కదా, మన ఇల్లు అనాలి! నేను ప్రేమకి బందీని అని చెప్పానుగా... అమ్మా నాన్నలంతగా అభిమానించే అత్తా మామలు, అమితంగా ప్రేమించే రాముడు లాంటి తమరు ఈ జీవితానికి అంతకన్నా ఏం కావాలీ...?'' అంటూ సరదాగా దీర్ఘం తీసిన నందూ ఒక క్షణం ఆగి ''అవునూ... మీరు ఎక్కడున్నట్లూ...?'' అనడిగింది.

''ఇంట్లోనే... ఏం...?''

‘‘అంటే... మన మాటలు పెద్దవాళ్ళు వినటం అంత బావుండదనీ...’’ అంటూ నసిగింది.

‘‘అమ్మా వాళ్లు లోపల గదిలో ఉన్నార్లే...! ఇక్కడ మాత్రం... నాకు ఇరువేపులా ఇద్దరు... నా వేపే చూస్తూ... ముసి ముసి నవ్వులు నవ్వుతూ... ఒక్కోసారి నోరారా ఫక్కున నవ్వినట్లుగా... అబ్బ ఎంత ముద్దుగా...’’ అతని వర్ణన పూర్తికాకముందే నందూ కంఠంలోకి చిరాకు వచ్చింది. ‘‘వర్ణన ఇక చాలుగానీ వాళ్ళెవరూ... మిమ్మల్ని చూసి నవ్వటం ఎందుకు...? అది చెప్పు ముందు....’’

సరదాగా నవ్వేసాడు రామం. ‘‘నువ్వు వద్దన్నాగానీ... నాకు వర్ణించాలనే అనిపిస్తోంది! తనివి తీరటం లేదు... ఏం చేయనూ... ఎర్రెర్రని... పసుపుపచ్చని... ఆ రంగుల సొగసును చూపులతోనే ఆస్వాదిస్తూ,,, ఓప్ా... ఎంత మధురమైన అనుభూతి...!’’

‘‘అంటే... నాకు సరిగా అర్థం కావటం లేదు. నీ మాటల్లో ఏదో మర్మం ఉందని అనుమానం కలుగుతోంది!’’

‘‘ఇంటి బయటకు వచ్చి అరుగుమీద కాళ్ళను క్రిందకు వేలాడేసి కూర్చున్నా. అటు ఇటూ రెండేసి ఎర్ర గులాబీల మొక్కలు, పసుపు పచ్చని గులాబీలూ ఉన్నాయన్న మాట! నిజంగా నందూ... ఆ మొక్కల నిండా ఉన్న అరవిరిసినవీ, పూర్తిగా విచ్చినవీ పూలను చూస్తుంటే... అవి నన్నే పలకరిస్తున్నట్లు మైమరపు కలుగుతోంది....!’’

అప్పుడే గుమ్మం దగ్గిరకు వచ్చిన శ్రీవల్లి ‘‘నందూతో నేనా మాటలు...? ఏమంటోంది...? అసలు విషయం చెప్పావా...?’’ అంటూ రామం వైపు చిరునవ్వుతో

చూసింది. రామం చెప్పానన్నట్లు తలవూపి... ''ఆటలాడటం మంచి పద్ధతి కాదంటోంది అమ్మా...'' అన్నాడు తడబడుతూ. ఏం చెప్పాలో తోచక ఆ క్షణం... అలా చెప్పేసాడు.

''అదేమిటీ...?'' అంటూ శ్రీవల్లి అతని దగ్గరకు వచ్చి సెల్‌ఫోన్ పై మూసి ఉన్న చేయిని తీసి తను అందుకుని మాట్లాడింది.

''నందూ... నువ్వు... ఆటలు వద్దంటున్నావన్నాడేమిటీ? ఆటపాటలు ఆరోగ్యానికీ, ఎంతో మంచివమ్మా... మనోల్లాసానికీ కూడా...!'' హాస్యంగా అంది.

నందిత ఫక్కున నవ్వేసి ''మీతో అదంతా వివరంగా తర్వాత చెబుతాలెండి ఇక ఫోన్ పెట్టేస్తున్నాను....'' అంది.

రామంకి ఆవిడ ఫోన్ ఇచ్చేసింది.

''నీ మొహంలోని ఆనందం చూస్తుంటే... నేనెంత పొరపాటు పని చేశానో ఇపుడు అర్థమైందిరా...''

రామం కొంచెం సిగ్గుగా ''ఏమిటమ్మా... వేళాకోళం చేస్తున్నావా...?'' అన్నాడు నసుగుతూ.

''వేళాకోళం ఎందుకూ... పిల్లల ముచ్చట్లే... పెద్దవాళ్ళకు ఆనందం! నేనెంత పొరపాటు చేశానో కూడా నాకు తెలిసివచ్చింది! ఎలాగో సరిచేసుకోగలిగే అవకాశం వచ్చింది కాబట్టి మనసు తేలికగా ఉంది...!'' అంటూ శ్రీవల్లి లోపలకు వెళ్ళిపోయింది.

రామం మళ్ళీ వెంటనే నందూకు ఫోన్ చేశాడు. ''ఏంటీ... అలా హఠాత్తుగా పెట్టేసావేం...?''

‘‘బావుంది... ఏం చేయనూ మరి... మా మధ్య పోట్లాట పెట్టాలన్నట్లుగా అలా చెప్పటమేమిటీ? నాకు అత్తయ్యతో పోట్లాడాలని ఉండదు... నీతో పోట్లాడటమే సరదాగా ఉంటుంది గానీ!’’ చిన్నగా నవ్వింది.

‘‘అలాగే... అయితే ఫర్వాలేదు. మా అమ్మ కూడా అదే అంటూ ఉంటుంది.... సీరియస్‌గా కాకుండా సరదాగా సాగే తగాదాలే సంసారంలో సంతోషాన్ని నింపుతాయటా!’’

‘‘అవును... అది అత్తయ్య స్వానుభవమేనేమో... మీ నాన్నగార్ని ముద్దుగా అత్తయ్య విసుక్కోవటం... నేనూ చూశాను!’’

‘‘ఇంతకీ నువ్వు ఎక్కడనుండి మాట్లాడుతున్నావ్...? ఇందాక నీకు వచ్చిన సందేహం ఇపుడు నాకూ వచ్చింది!’’

‘‘ఎవరూ వినే అవకాశం లేదులే, నేను కారులోనే ఉదయం నుండీ అలా అలా తిరిగి ఇపుడు ఇంటికి వచ్చి... కారులో నుండి దిగకమునుపే నీ ఫోను వచ్చేసరికి... ఇలాగే కారులోనే కూర్చుని మాట్లాడుతున్నా...!’’

‘‘ఒంటరిగా వెళ్ళావా... కారులో షికారుకి...?’’

‘‘అవునుగానీ... నాకు మాత్రం ఒంటరిగా వెళ్తున్నట్లు అనిపించలేదు ప్రకృతినీ వెంటబెట్టుకుని వెళ్తున్నట్లుగా హుషారుగా అనిపించిందిలే! చెట్టు చేమల్ని చూస్తూ... పిట్టల కిచకిచల్ని వింటూ... ప్రయాణం ఎంత బావుందో...! ప్రకృతే మనకో గొప్ప పాఠ్యగ్రంథం అనుకోవచ్చు కదూ. నాకు వర్ణించటం రాదు కాబట్టి... మనసుకు తోచింది చెప్పేస్తున్నానంతే! అసలు చెప్పాల్సింది ముఖ్యమైన విషయం ఉంది... నువ్వు

చెయ్యకపోయినా, రేపో ఎపుడో నేనే ఫోను చేసి, ఆ అనుభవాన్ని నీతోనూ పంచుకునేదాన్నే! అయితే నువ్వే ఇపుడు చేయటం వలన... వెంటనే చెప్పేస్తున్నా!

అలా అలా కారులో తిరుగుతూ నా కిష్టమైన పద్ధతిలో ఎంత దూరం వెళ్ళానో కూడా గుర్తించకుండా దూరంగా వెళ్ళిపోయా. ఆకలి వేస్తుంటే... అపుడు ఎక్కడైనా హోటల్ ఉంటుందేమోనని చూసాను కానీ ఏం లాభం లేదని తెలిసిపోయింది... నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశానికి... ఊరవతలికి వచ్చేసానని అర్థమైంది!

దూరంగా చిన్న పాక కనిపిస్తుంటే... అటువైపు వెళ్ళాను... ఒక పెద్దావిడ ఇంటిముందు గిన్నెలు కడుక్కుంటుంటే... ఆ చుట్టు పక్కల ఏదైనా హోటల్ ఉందేమోనని వాకబు చేశాను.

ఆవిడ ఇల్లే ఒక హోటల్ అట. ఆ మాట చెబుతూ బోసినోటితో నవ్వింది. ఆ ఇంటి వెనుక దూరంగా ఉన్న పల్లెలోని కొంతమంది రివాజుగా రోజూ వచ్చి ఇడ్లీ దోసలాంటివి తిని వెళ్తూంటారట. ఆటైమూ దాటిపోయింది గనుక అక్కడా ఏమీ లేవని చెప్పింది.

''అయ్యో... అలాగా... నాకు బాగా ఆకలి వేస్తోందే...!' అన్నాను, లోపల అనుకుంటున్న మాటల్ని పైకే అనేసానన్నమాట! ఆవిడ బాగా నొచ్చుకుంటూ కూర్చోమని చెప్పి... లోపలకు వెళ్ళి... పెతికి కొంచెం పిండి ఉంటే, దానిలో ఇంకేదో పిండి కలిపి... ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలతో మూడు దోసెలు వేసి, ఇంట్లో వాళ్ళకు చేసుకున్న ఎర్రటి పచ్చడినీ పెట్టి తినమని ఇచ్చింది.

ముడతల పడ్డ శరీరం, ఒంగిన నడుముతో ఆవిడ పనిచేస్తుంటే, కూర్చోవటానికి నాకు కొంచెం సిగ్గుగా అనిపించి... సాయం చేయబోయా... తనకు అలవాటైన

పనేనంటూ, నా సాయాన్ని ఒప్పుకోలేదు. ఇంట్లోనే ఉన్న పదేళ్ళ మనవడు మాత్రం పనులన్నింటిలో సాయం చేస్తూ అవ్వకు చేదోడుగా ఉన్నాడు.

ఆ అవ్వ ఆదరంగా వేసి ఇచ్చిన దోసెలను ఆవురావురమంటూ తిని, పర్సులో ఉన్న డబ్బును లెక్కకూడా చూడకుండా మొత్తం ఆ అవ్వ చేతిలో పెట్టాను. ఆకలి తీరిన నాకు అంత కృతజ్ఞత కలిగింది.

ఆవిడ వద్దంది. తీసుకోకుండా తన చేతిలోని డబ్బును మళ్ళీ నా పర్సులోనే పెట్టేసింది. 'ఈ వయసులో... ఇంత కష్టపడి... అన్నీ అయిపోయినా, కాదనకుండా చేసి పెట్టి డబ్బు తీసుకోకపోతే ఎలా అవ్వా...?' అన్నాను.

''మా భుక్తికోసం హోటల్ నడుపుతున్నాం... రోజూ అందరికీ టిఫిన్లు పెట్టి... డబ్బు తీసుకునేది నిజమే గానీ... ఇపుడు మాత్రం... నీ నోటివెంట వచ్చిన 'ఆకలి' అనే మాటకే చేసి పెట్టాను! బిడ్డ ఆకలి తీర్చేలా పెట్టగలగటం అమ్మకు ఎంత ఆనందంగా ఉంటుందో తెలుసునా అమ్మా...? అలాంటి ఆనందం కోసమే నీకు ఇలా చేసి పెట్ట గలిగాననుకో...!'' అంది.

భుక్తికోసం ఆ వయసులో కూడా రోజంతా శ్రమపడే అవ్వ డబ్బును కాదనటం నాకు చాలా విచిత్రంగా అనిపించి... విస్తుపోయాను!

'ఆకలి' అనే మాట... నా నోటివెంట రాగానే ఆమెలో చురుకువచ్చింది. ఆమె మనసును కదిలించింది! లేని ఓపికను తెచ్చుకుని... నా ఆకలిని తీర్చే పని చేపట్టింది!

ఆమె శరీరంలో జవసత్వాలు లేవు! ధీమానిచ్చే ఆస్తిపాస్తులూ వాళ్ళకి లేవు! అయితేనేం గొప్ప తల్లి మనసు ఉంది...! అందుకే నా ఆకలికి అలా స్పందించగలిగింది!

ఆ అవ్వేకాదు, ఆవిడ మనవడు చిన్న పిల్లవాడు కూడా నేనివ్వబోయిన డబ్బుని తిరస్కరించి ఎంత చక్కగా సమాధానం చెప్పాడో తెలుసునా...?

''మేం దోసెలకి తీసుకునే డబ్బు చాలా తక్కువండీ. అయినా సమయం దాటి వచ్చిన మిమ్మల్ని మా అవ్వ ఓ బంధువుగా భావించి మర్యాద చేసింది. అంతేకాదండీ, ఎవరిదగ్గర్నుండీ ఉచితంగా ఏదీ తీసుకోకూడదనేది మా నాన్న మాకు చెప్పిన ఓ పాఠం. దేముడు మనకి కష్టపడటానికి వీలుగా కాళ్ళూ చేతులూ ఇచ్చాడుకదా, అందుకని ఉచితంగా ఏమీ ఆశించకూడదూ అని చెప్పాడండీ. అలా ఉచితంగా తీసుకోవటం అంటే అర్హత ఉన్నవాళ్ళకు మనం అడ్డం పడి దోచుకోవటంగా భావించాల్సి ఉంటుందీ అని మా నాన్న అంటూ ఉంటాడు కూడా!''

ఆ అబ్బాయి మాటలకు ముచ్చటపడి అతని చదువు గురించి వివరాలడిగాను, వాళ్ళమ్మ పాపం... ఆ అబ్బాయి పుట్టినపుడే చనిపోయిందట! అక్కడికి చాలా దూరంగా ఉన్న బడికి వెళ్ళి చదువుకుంటున్నాడట!

ఆ అబ్బాయికి నేనేమైనా చేయగలిగే అర్హతతోనే మళ్ళీ వెళ్ళాలనుకుంటున్నా. మళ్ళీ వస్తాననీ ఆ అబ్బాయికీ, అవ్వకీ చెప్పి వచ్చాను. అంటే.. నా ఉద్దేశ్యం నీకు అర్థమైందా...?''

నందిత గొంతులో ఉత్సాహం వినిపించింది రామంకి. ఒక క్షణం ఆలోచించి చిన్నగా నవ్వాడు.

''చెప్పనా... నా ఆలోచన అయితే.. ఆ అబ్బాయిని దత్తత తీసుకునే ఆలోచన నీకు ఉందని... అవునా...?''

‘‘భలే కరెక్టుగా ఊహించావే...’’ అంటూ నందితా చిన్నగా నవ్వి మళ్ళీ అంది.

‘‘అవును... మనిద్దరం కలిసే ఆపని చేయాలి! ఏమంటావ్...?’’

‘‘అంటే... మనం భార్యా భర్తలమైన వెంటనే తల్లిదండ్రులమైపోతా మన్నమాట! అంతే కదూ...? కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుడతాడనే సామెత ఉంది. అది మనకి ఈ విధంగా నిజమవబోతోంది! అవునా...?’’ అంటూ రామం నవ్వాడు.